సాక్షి నల్లగొండ

శనివారం । 11 । అక్టోబర్ । 2025



అవగాహనతోనే నివారణ

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు సర్వేజన ఫౌండేషన్‌తో ఎంజీయూ ఒప్పందం కుదుర్చుకుంది. - 8లో



తండ్రిపై హత్యాయత్నం

ఆస్తి కోసం ఓ వ్యక్తిపై అతడి భార్య, కుమారులు హత్యాయత్నం చేశారు. ఈ ఘటన మేగ్యాతండాలో చోటుచేసుకుంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	590 అడుగులు
ఇన్‌ఫ్లో	:	83,888 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	83,888 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,495 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,353 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	600 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

వాడపల్లి ఎస్‌ఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలం కొత్తపేటతండాకు చెందిన సాయిసిద్ధు అనే గిరిజన యువకుడు ఇటీవల యూరియా కోసం ధర్నా చేశాడని వాడపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లు విచక్షణారహితంగా కొట్టారని ఆరోపిస్తూ మహబూబాబాద్‌కు చెందిన సామాజిక వేత్త రేవంత్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు స్పందించిన హక్కుల కమిషన్ శుక్రవారం బాధ్యులైన ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, కానిస్టేబుళ్లను వెంటనే విధుల నుంచి తొలగించాలని జిల్లా ఎస్పీని ఆదేశించింది. ఈ సంఘటనపై వెంటనే ఉన్నత స్థాయి విచారణ చేపట్టి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కమిషన్ ఆదేశించిందని రేవంత్ తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం అడ్డుకట్ట



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : బీసీ రిజర్వేషన్ల అమలులో కేంద్రం ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అసెంబ్లీలో చర్చించిందని, ఆ సమయంలోనే అన్ని రాజకీయ పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయన్నారు. అసెంబ్లీ ఆమోదంతోనే బిల్లును రాష్ట్రపతి, గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని అక్కడ బిల్లు ఆమోదించకుండా కేంద్రం కావాలనే కాలయాపన చేస్తుందన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు పన్నుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పక్షాల నాయకులను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, పాదూరి శశిధర్‌రెడ్డి, మంగారెడ్డి, గోవర్ధన, కోటిరెడ్డి, అరుణ, నాగేందర్, చారి పాల్గొన్నారు.

ఎంపీఓల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షురాలు సుమలత

నల్లగొండ టూటౌన్: మండల పంచాయతీ అధికారుల (ఎంపీఓల) సంఘం జిల్లా కమిటీ ఎన్నికలు శుక్రవారం నల్లగొండలో జరిగాయి. సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కనగల్ ఎంపీఓ కుంభం సుమలత ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మాతంగి రమేష్, కోశాధికారిగా మాధవరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బొమ్మ సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కొండా వెంకయ్య, శంకర్ నాయక్‌లు వ్యవహరించారు. కార్యవర్గానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అథర్ పర్వేజ్ శుభాకాంక్షలు తెలిపారు.

సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన

నల్లగొండ : పారదర్శక పాలనకు సమాచార హక్కు చట్టం పాశుపతాస్త్రం అని ఇన్‌చార్జి డీఆర్‌ఓ, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నల్లగొండలోని డీఆర్‌ఓ చాంబర్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత పెంచేందుకు సమాచార హక్కు చట్టం వచ్చిందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు వారికి అవసరమైన సమాచారాన్ని 30 రోజుల్లో సంబంధిత అధికారుల నుంచి పొందవచ్చన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో జిల్లా తహసీల్దార్లు, సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

● కోర్టు స్టేపై బీసీ సంఘాల ఆగ్రహం




నల్లగొండ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీఓపై హైకోర్టు స్టే విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం జిల్లా బంద్‌లో భాగంగా నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

13న ప్రజావాణి

నల్లగొండ: ఈ నెల 13న సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాష్ట్ర హైకోర్ట్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసినందున ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు.

● పెద్ద గడియారం ఆగిపోయింది




నల్లగొండ పట్టణ నడిబొడ్డున ఉన్న పెద్ద గడియారం ఏడాది కాలంగా పనిచేయడం లేదు. నిజాం కాలంలో ఎత్తైన స్తంభానికి నాలుగు దిక్కులా గడియాలు అమర్చారు. దీంతో ఈ సెంటర్‌కు గడియారం సెంటర్‌గా పేరుపడింది. మంత్రి క్యాంపు కార్యాలయం ముందే ఈ గడియారం ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గడియారాలను మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ముసురుకున్న జ్వరాలు

- దగ్గు, జలుబు, జ్వరం, నొప్పులతో బాధపడుతున్న ప్రజలు
- రోజురోజుకు ఆసుపత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య
- ఫిబ్రవరి నుంచి 22 డెంగీ, 8 మలేరియా కేసులు నమోదు
- వరుస వర్షాలతో వాతావరణంలో మార్పులే కారణమంటున్న వైద్యులు



నకిరేకల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన వీరమళ్ల వెంకటయ్య నెల రోజుల క్రితం దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లాడు. అయనకు వైద్యసిబ్బంది రక్త పరీక్షలు చేసి డెంగీ అని నిర్ధారించారు. దీంతో ఆయన పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందగా రూ.25 వేల వరకు బిల్లు చెల్లించాల్సి వచ్చిందని వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు జిల్లా అంతటా పారిశుద్ధ్యం లోపించి విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

నల్లగొండ టౌన్: వరుసగా కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోత, రాత్రి చలి గాలులు వీస్తుండడంతో జనం విషజ్వరాల బారిన పడుతున్నారు. వర్షాల కారణంగా నీటి కుంటలు, మురికి కాల్వల్లో నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తి పెరుగుతుంది. దీనికి తోడు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. కొన్ని ప్రాంతాల్లో కాలనీల్లో నీరు కలుషితమై జనం డయేరియా బారిన పడుతూ ఆసుపత్రుల పాలలవుతున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 22 డెంగీ కేసులు, 8 మలేరియా కేసులు నమోదైనట్లు తెలుస్తుంది. వాస్తవంగా రెండింతలు డెంగీ, మలేరియా కేసులు ఉన్నట్లు సమాచారం. వర్షాల వల్లే వాతావరణ మార్పులు, పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు పెరిగి జనం విషజ్వరాల బారిన పడుతున్నారని వైద్యులు పేర్కొంటున్నారు.



నల్లగొండలోని జనరల్ ఆసుపత్రిలో ఓపీ విభాగం వద్ద బారులుదీరిన రోగులు

ఆసుపత్రులకు పెరుగుతున్న రోగులు

జిల్లాలో డయేరియా, డెంగీ, మలేరియా, చికున్ గున్యా, కీళ్ల, ఒంటినొప్పులతో బారిన పడి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు బారులుదీరుతున్న పరిస్థితి నెలకొంది. నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)తోపాటు నకిరేకల్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ఏరియా ఆసుపత్రులతోపాటు మర్రిగూడ కమ్యూనిటీ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య పరీక్షలకు వస్తున్న రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పది రోజుల క్రితం వరకు నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓపీ 800 వరకు ఉండగా ప్రస్తుతం 1,200 వరకు చేరింది. ఏరియా ఆసుపత్రులలో ఓపీ సుమారు 100 వరకు ఉండగా ప్రస్తుతం 150 వరకు పెరిగింది. ఇన్ పేషెంట్ల సంఖ్య రెండింతలైందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, పల్లె దవాఖానాల్లో కూడా రోగుల రోజురోజుకు పెరిగిపోతోంది. ఇదిలా ఉండగా డెంగీ బారిన పడుతున్న కొందరు రోగులు ప్రభుత్వ ఆసుపత్రులు సకాలంలో వైద్యం అందక ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఫలితంగా రూ.వేలకు వేలు ఫీజులు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం



జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు పెరుగుతున్న కారణంగా వాటిని అరికట్టేందుకు వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ పల్లె దవాఖానాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాం. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. తీవ్రమైన జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి.

- పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

గురుకుల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు

- విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి కొరడా
- మౌలిక వసతులు కల్పించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక



నల్లగొండలోని మైనార్టీ బాలుర గురుకులంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఎస్‌ఎల్‌బీసీ కాలనీలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌కు కలెక్టర్ ఇలా త్రిపాఠి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం కలెక్టర్ ఆ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పాఠశాలలో భోజనం చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి భోజనం కోసం బయటకు వెళ్లారు. దీంతోపాటు పాఠశాలలో అపరిశుభ్రత నెలకొని ఉండడం నిర్వహణ సరిగా లేకపోవడం, కొందరు ఉపాధ్యాయులు పాఠశాల సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా గైర్హాజరైనట్లు కలెక్టర్ గుర్తించారు. నిధులు సరిపడా విడుదలవుతున్నా సౌకర్యాలు లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రిన్సిపాల్‌కు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, అవసరమైన అన్ని వసతులు కల్పించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీఓలు వారి పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం కాసేపు విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు చెప్పారు. ఆమె వెంట నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.

మద్దతు ధర పొందాలి



నల్లగొండలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి(నల్లగొండ), నకిరేకల్: నాణ్యతాప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర క్వింటాకు రూ.2,389 పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. శుక్రవారం ఆమె నల్లగొండ మండలం అర్జాలబావి, నకిరేకల్ మండలం తాటికల్‌లో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తాలు, మట్టిపెడ్డలు లేకుండా ధాన్యాన్ని తేవాలన్నారు. ఆమె వెంట డీసీఓ పత్యానాయక్, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, డీఎస్‌ఓ వెంకటేశం, నకిరేకల్ తహసీల్దార్ యాదగిరి, ఏడీఏ జానిమియా, పీఏసీఎస్ సీఈఓ జగన్‌రెడ్డి ఉన్నారు.

టెన్త్‌లో వందశాతం ఫలితాలు సాధించాలి

- డీఈఓ భిక్షపతి



కేతేపల్లి : విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

కేతేపల్లి, కట్టంగూర్: ప్రభుత్వ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా కృషిచేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) బి.భిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఆయన కేతేపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన నాణ్యత, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. తరగతిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాసామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు చదవటం, రాయటం అంశాలలో ఏ స్థాయిలో ఉన్నారో ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట కట్టంగూర్ ఎంఈఓ అంబటి అంజయ్య,, కేతేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ కేతేపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం వంటిపాక రఘు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం అశ్విని, చెర్వుఅన్నారం హెచ్‌ఎం కందాల రమ, పీఎస్ హెచ్‌ఎం భీమయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నరహరి, పుల్లయ్య, నాగేష్ తదితరులు ఉన్నారు.


బెదిరింపులకు భయపడకుండా టెండర్లు వేయండి

- ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సంతోష్

నల్లగొండ: కొత్త పాలసీ ప్రకారం మద్యం దుకాణాలకు అర్హులంతా నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 154 దుకాణాలకు ఎస్టీ వర్గానికి 4, ఎస్సీ వర్గానికి 14, గౌడ సామాజిక వర్గానికి 34 దుకాణాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్ల దుకాణాలకు తమ సంఘాలతో కలిసి మాత్రమే టెండర్ వేయాలని ఇతరులతో కలిసి వేయరాదంటూ కొందరు ఒత్తిడి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి బెదిరింపులకు భయపడకుండా ఆయా కేటగిరీలకు సంబంధించి ఎవరైనా టెండర్ వేయవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించేవారికి కనీసం 21 ఏళ్లు నిండి ఉండాలని.. ప్రతి దరఖాస్తుకు రూ.3 లక్షల డిమాండ్ డ్రాఫ్టు లేదా చలానా రూపంలో సమర్పించాలని తెలిపారు. ఎవరైనా సిండికేట్ రూపంలో ఏర్పడి తక్కువ దరఖాస్తులు వచ్చేలా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వ్యవహరిస్తే ఆయా షాపులకు రీ నోటిఫికేషన్ వేసి మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ దరఖాస్తులకు గడువు ఉందని తెలిపారు.

ఆస్తి పన్ను వసూలుకు రెడ్ నోటీసులు

- నీలగిరి మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ
- ఇప్పటికే 500 మంది బకాయిదారుల గుర్తింపు
- పాత బకాయిలు రూ.20 కోట్లకుపైనే పెండింగ్
- ఈ ఏడాది వసూలు కావాల్సిన పన్ను రూ.11 కోట్లు



నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టింది. మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో 45 వేల వాణిజ్య, నివాస భవనాలు ఉన్నాయి. వీటన్నింటికి ఏడాది ఆస్తి పన్ను డిమాండ్ రూ.18 కోట్లు ఉంది. అయితే ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటి వరకు రూ.7.50 కోట్లు వసూలు కాగా వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా మిగతావి వసూలు చేయాల్సి ఉంది. కానీ వరుసగా వస్తున్న పండుగల నేపథ్యంలో ఆస్తి పన్ను చెల్లించేందుకు భవనాల యజమానులు ఆసక్తి చూపించడంలేదు. దీపావళి పండుగ ఉండడంతో ఈ నెలలో కూడా ఆస్తిపన్ను వసూలు కష్టమేనని తెలుస్తోంది. అయితే పాత బకాయిలు, ఈ ఏడాది ఆస్తి పన్ను కలిపి మొత్తంగా రూ.31కోట్లకు పైగానే వసూలు కావల్సి ఉంది. రానున్న ఆరు నెలల కాలంలో నెలకు రూ.5 కోట్లకుపైగా లక్ష్యంగా పెట్టుకొని వసూలు చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు..

నీలగిరి పట్టణంలో భవనాల యజమానులు కొందరు ఆస్తి పన్ను సక్రమంగా చెల్లించకుండా మొండికేస్తున్నారు. ఒక్కో భవనానికి కొందరు రూ.లక్షల్లో బకాయిలు పడ్డారు. దాంతో పాత బకాయిలే పట్టణంలో రూ.20 కోట్లకు పైగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. పాత బకాయిల వసూలు కోసం మున్సిపల్ సిబ్బంది వెళ్లగానే సంబంధిత భవనాల యజమానులు స్థానిక రాజకీయ నాయకులు నుంచి ఫోన్లు చేయించి ఆస్తి పన్ను చెల్లించకుండా జాప్యం చేసుకుంటూ వస్తున్నారు. దాంతో కోట్ల రూపాయల ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. ఎక్కువ ఆస్తి పన్ను పడ్డ వారిలో 500 మందిని గుర్తించి వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆస్తి పన్ను బకాయిలపై రెడ్ నోటీసులు జారీ చేయాలని స్థానిక సంస్థల కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దాంతో ఆ దిశగా మున్సిపల్ సిబ్బంది ముందుకు పోయేందుకు ఎక్కువ బకాయి ఉన్న జాబితా సిద్ధం చేసే పనిలో పడ్డారు. రెడ్ నోటీసుల జారీ తరువాత కూడా బకాయి పన్ను చెల్లించకుంటే ఆస్తులను కూడా జప్తు చేయాలని మున్సిపల్ యంత్రాంగం భావిస్తోంది. ప్రత్యేకాధికారి పాలన కావడంతో సిబ్బంది రాజకీయ నాయకుల ఫోన్‌లను పట్టించుకునే అవకాశం తక్కువగానే ఉంటుంది. బకాయిలపై ఫోకస్ పెడితే 90 శాతం వరకు వసూలు అయ్యే అవకాశం ఉంటుంది.

నోటీసులు జారీ చేస్తున్నాం

పాత బకాయిలు ఎక్కువగా ఉండి చెల్లించని 500 మందిని గుర్తించి రెడ్ నోటీసులు జారీ చేశాం. పన్ను బకాయిలు వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి. పన్ను చెల్లించని బకాయిదారుల ఆస్తులను చట్ట ప్రకారం జప్తు చేస్తాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు

నల్లగొండ టూటౌన్ : పెన్షన్ అనేది ఎవరి భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు అని, కేంద్ర ప్రభుత్వం వ్యాలిడేషన్ చట్టాన్ని రద్దుచేయాలని మాజీ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాలిడేషన్ చట్టం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్, ఎన్పీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. టాప్రా జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్ చంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల ఐదు విడతల కరువు భత్యాన్ని మంజూరు చేయాలని, రెండవ పీఆర్సీని ప్రకటించి 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ మోతీలాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కొప్పు రామచంద్రం, కేసాని భిక్షంరెడ్డి, టాప్రా నాయకులు వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, గుండాల భిక్షమయ్య, రాఫెల్, రాపోలు వెంకటేశం, కృష్ణయ్య, చాపల అంజిరెడ్డి, భావనారుషి, అక్బర్ హుస్సేన్, ముజిహిద్, గాదె నరసింహ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

చెర్వుగట్టు ఆదాయం రూ.40.46 లక్షలు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతి జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం హుండీలను శుక్రవారం లెక్కించారు. 85 రోజులకు సంబంధించి రూ.40,46,640 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. అలాగే అన్నదానం కార్యక్రమానికి భక్తులు సమర్పించిన హుండీని లెక్కించగా రూ.50,844 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటయ్య, రాజ్యలక్ష్మి, నరేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

క్లుప్తంగా

అదుపుతప్పి ఆటో బోల్తా

ఆలేరురూరల్: ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలోని సోమారం గ్రామానికి చెందిన విద్యార్థులు, ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన ఎనిమిది మంది కొలనుపాక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, నలుగురు ఇతర ప్రయాణికులు మొత్తం 12 మందితో శుక్రవారం ఉదయం సోమారం గ్రామం నుంచి కొలనుపాకకు వస్తున్నారు. కొలనుపాక శివారులోకి రాగానే రోడ్డు గుంతలుగా ఉండడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటో డ్రైవర్‌తో పాటు అందులోని విద్యార్థులకు, ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. నవ్య అనే అమ్మాయికి తలకు గాయాలయ్యాయి. డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నా డు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన నల్ల యాదయ్య కుమారుడు శంకర్ (22) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల యాదయ్య సోదరుడి కుమారుడు మృతిచెందడంతో వారికి ధైర్యంగా ఉండేందుకు గాను గురువారం రాత్రి యాదయ్య, ఆయన భార్య కలిసి వారి ఇంటి దగ్గర నిద్రించేందుకు వెళ్లారు. దీంతో శంకర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో శంకర్ తల్లిదండ్రులు ఇంటికి వచ్చి తలుపు తీయగా కుమారుడు వంట గదిలోని ఇనుపపైపుకు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. శంకర్ తరచుగా ఫోన్‌లో ఓ యువతితో మాట్లాడుతుండే వాడని, ఆమె కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం–పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ మధ్య సూర్యాపేటకు చెందిన మనన ప్రతాప్‌సింగ్(56) అనారోగ్య కారణాలతో గురువారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విజయవాడ మార్గంలో వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడి వద్ద లభించిన సిమ్ కార్డ్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని జీఆర్పీ హెడ్ కానిస్టేబల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం


మాడుగులపల్లి: మండలంలోని అభంగాపురం గ్రామ శివారులోని రైల్వే క్రాసింగ్ కింద అండర్‌పాసింగ్ వద్ద శుక్రవారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామానికి చెందిన ఎరనాగుల రాంజీ(50) మాడుగులపల్లి మండలం అభంగాపురం గ్రామ శివారులోని రైల్వే క్రాసింగ్ అండర్‌పాసింగ్ వద్ద మృతి చెంది ఉన్నాడు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్ నారాయణపురంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి శుక్రవారం ఆ గ్రామానికి చెందిన యువకులు తిరిగి అప్పగించారు. గట్టుప్పల్‌కు చెందిన బక్క భిక్షం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా సంస్థాన్ నారాయణపురంలో ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద రూ.30వేల విలువ గల మొబైల్ పడిపోయింది. గ్రామానికి చెందిన అందె నరేష్ మొబైల్‌ను గమనించాడు. ఇంతలో భిక్షం తన మొబైల్‌కు ఫోన్ చేయగా.. నరేష్ లిఫ్ట్ చేసి ఫోన్ తన వద్దే ఉందని వివరించాడు. అతను ఫోన్‌ను తిరిగి భిక్షంకు అందజేశాడు.

నాలుగు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


నాగార్జునసాగర్: ఎగువ నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 83,888 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. అంతే నీటిని దిగువకు వదులుతున్నారు. 4 గేట్ల ద్వారా 32,400 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 33,495 క్యూసెక్కులు మొత్తం 65,895 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడికాల్వ, ఎడమ కాల్వ, ఏఎమ్మార్పీ కాల్వలకు 17,993 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా జలాశయంలో అంతే నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



సాగర్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. శుక్రవారం 5,838 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. దీంతో 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం 644.28 అడుగుల వద్ద ఉంది. దీంతో అధికారులు ప్రాజెక్టు రెండు క్రస్ట్ గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 6,437 క్యూసెక్కుల నీటిని దిగవకు వదులుతున్నారు. ఆయకట్టులో పంటల సాగుకు కుడి, ఎడమ ప్రధాన కాల్వకు 340 క్యూసెక్కులు వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం 6,826 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. మూసీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.27 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.



ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు పోతున్న నీరు

ఆస్తి కోసం తండ్రిపై హత్యాయత్నం

- ఇద్దరు కుమారుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ రాజశేఖర్

పెన్‌పహాడ్: ఆస్తి కోసం ఓ వ్యక్తిపై ఇద్దరు కుమారులతోపాటు, అతడి భార్య హత్యాయత్నం చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని మేగ్యాతండా తండాలో ఈ నెల 7న చోటు చేసుకుంది. శుక్రవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. తండాకు చెందిన ఆంగోతు కుర్వా, కోటమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు పవన్‌కళ్యాణ్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. భార్యకు అక్రమ సంబంధం ఉందని



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

భావించిన కుర్వా గత నాలుగేళ్లుగా వేరుగా ఉంటున్నాడు. కుర్వా పేరు మీద 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే తన తండ్రి బతికి ఉంటే ఆ భూమి తమకు దక్కదనే ఉద్దేశంతో అతడిని హత్య చేయడానికి కుట్ర పన్నారు. ఈ నెల 7న అర్ధరాత్రి కోటమ్మతో పాటు కుమారులు ఇంటికి వెళ్లి కుర్వాపై దాడి చేశారు. అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కారు. కళ్లకు గంతలు కట్టి ఇనుపరాడ్డు, కర్రతో కాళ్లు, చేతులపై, ఎడమ దవడపై కొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించారు. చుట్టుపక్కల వారు చూసే సరికి భయంతో తండ్రిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో పోలీసులు ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పవన్‌కళ్యాణ్, ప్రవీణ్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కుర్వా భార్య కోటమ్మ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ లింగరాజు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా బైక్‌ను ఢీకొట్టిన లారీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



విక్రమ్‌రెడ్డి(ఫైల్)

నకిరేకల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై బైక్‌పై వస్తున్న ఇద్దరు యవకులు రోడ్డు దాటుతుండగా లారీ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్‌లోని మార్కెట్ రోడ్డులోని నివాసం ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి శానాల యుగేందర్‌రెడ్డికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు విక్రమ్‌రెడ్డి (26) ఇటీవల బీటెక్ పూర్తి చేసి, ఇంటి వద్ద ఉంటున్నాడు. విక్రమ్‌రెడ్డి తన ఇంటి నుంచి మార్కెట్ రోడ్డులో నివాసం ఉంటున్న తన మిత్రుడు రావుల ప్రభు(23)తో కలిసి బైక్‌పై నకిరేకల్ శివారులోని పద్మానగర్ జంక్షన్‌కు వెళ్లి తిరిగి నకిరేకల్‌కు వస్తున్నాడు. జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ ట్యాంకర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో విక్రమ్‌రెడ్డి లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న ప్రభుకు తీవ్రగాయాలయ్యాయి.



విక్రమ్‌రెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న అతడి తల్లిదండ్రులు, కుటుంబీకులు

పోలీసులు విక్రమ్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ప్రభు పరిస్థితి విషమంగా ఉండడంతో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన లారీ ట్యాంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యుగేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేష్ తెలిపారు. కాగా.. విక్రమ్‌రెడ్డి తండ్రి యుగేందర్‌రెడ్డి సొంత గ్రామం శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం. గత కొన్నేళ్ల క్రితం నకిరేకల్‌లోని మార్కెట్ రోడ్డులో స్థిరపడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. తమ కుమారుడికి వివాహ సంబంధాలు కూడా చూస్తున్నామని, ఇంతలోనే ఇలా అయిందని కన్నీటిపర్యంతమయ్యారు.

అవగాహనతో రోడ్డుప్రమాదాల నివారణ

నల్లగొండ టూటౌన్: రోడ్డు భద్రతపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో శుక్రవారం సర్వేజన ఫౌండేషన్‌తో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ.. ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతోనే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు అవగాహన కల్పించేందుకు వారు తమ, తమ గ్రామాల్లో ప్రచారం కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు గురువారెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో సాగుతున్న సేవా కార్యక్రమాలను యూనివర్సిటీ పరిధిలోని విద్యాలయాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏడాదికి లక్షల్లో ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలను నిరాశ్రయులను



ఒప్పంద పత్రాలు చూపుతున్న వీసీ, రిజిస్ట్రార్

చేయడం అత్యంత విషాదకరన్నారు. కేవలం అవగాహన ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అలువాల రవి, ఐక్యూ ఏసీ డైరెక్టర్ మిర్యాల రమేష్, ప్రిన్సిపాల్ కొత శ్రీదేవి, సురం శ్వేత, ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్ పాల్గొన్నారు.

పెరుగుతున్న బాలాజీనాయక్ బాధితులు

- ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు నల్లగొండకు వచ్చిన కొందరు

నల్లగొండ: వడ్డీ వ్యాపారి బాలాజీ నాయక్ బాధితులు పెరుగుతున్నారు. అధిక వడ్డీ ఆశచూపి అమాయక ప్రజల నుంచి రూ.వందల కోట్లు వసూలు చేసిన పీఏపల్లి మండలం పలుగుతండాకు చెందిన బాలాజీనాయక్‌పై ఇప్పటికే పోలీస్ శాఖ కేసులు నమోదు చేసింది. బాధితుల ఆందోళనపై 'సాక్షి' శుక్రవారం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో శుక్రవారం పుట్టంగండి గ్రామానికి చెందిన కొందరు బాధితులు లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు పుట్టంగండి వాసి ముడావత్ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు నల్లగొండకు వచ్చారు. సాయంత్రం వరకు వేచి చూశారు. ఎస్పీ అందుబాటులో లేకపోవడంతో శనివారం కలవనున్నట్లు శ్రీనునాయక్ పేర్కొన్నారు.

కల్తీ వరి విత్తనాలు వచ్చాయని రైతుల ఆందోళన



కంపెనీ ప్రతినిధులకు వరి పైరు చూపుతున్న రైతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడిలో చింట్లు సీడ్ రకం వరి విత్తనాల్లో కల్తీ విత్తనాలు వచ్చాయని శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. కోదాడకు చెందిన ముగ్గురు విత్తన దుకాణాదారులకు, సంబంధిత డీలర్లకు గతం వారం రోజులుగా చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వరి సాగు పొట్టదశకు రావడంతో ముందుగా బెరుకులు ఈతకు వచ్చాయని అవి దొడ్డురకంగా ఉన్నాయని తెలిపారు. ఈ విధంగా బెరుకులు రావడంతో ఎకరానికి 5బస్తాల దిగుబడిపై ప్రభావం పడుతుందన్నారు. గ్రామంలో దాదాపుగా 150 మంది రైతుల భూమికి సంబంధించి 300 ఎకరాల్లో బెరుకులు ఈవిధంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉంగా.. శుక్రవారం పంట పరిశీలనకు ఆయా కంపెనీల డీలర్లు వచ్చారు. న్యాయం చేయాలని కోరితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తూ రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. వారి నుంచి కారును స్వాధీనం చేసుకున్నారు. సీడ్ డీలర్, డిస్ట్రిబ్యూటర్లు వచ్చి న్యాయం చేసిన తర్వాతే కారు ఇస్తామని రైతులు తెలిపారు. కార్యక్రమంలో శిరంశెట్టి రామారావు, శెట్టి శ్రీనివాసరావు, శిరంశెట్టి రవి, రామారావు, చాప సురేష్, కొండ, రమణ , చేతుల రామకష్ణ, తెల్లగొర్ల రామకష్ణ, తిరపతిరావు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికురాలికి బ్యాగ్ అందజేస్తున్న అధికారులు

కోదాడ: కోదాడ– ఖమ్మం రూట్‌లోని ఆర్టీసీ బస్సులో శుక్రవారం ప్రయాణించిన ఓ ప్రయాణికురాలు ఆభరణాలు, నగదుతో కూడిన బ్యాగ్‌ను మరిచిపోయింది. దానిని గమనించిన బస్సు కండక్టర్ ప్రవీణ్‌కుమార్ కోదాడ కంట్రోలర్‌కు అందజేశాడు. బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికురాలు కోదాడ ఆర్టీసీ అధికారులను సంప్రదించడంతో సెక్యూరిటీ అధికారులు సదరు బ్యాగ్‌ను ప్రయాణికురాలికి అందజేశారు. లక్షన్నర విలువల గల వస్తువులు ఉన్న బ్యాగ్‌ను తిరిగి అప్పగించిన ఆర్టీసీ అధికారులకు, కండక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. ఈమేరకు కండక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను డిపో మేనేజర్ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

చెరువు కట్టకు గండికొట్టిన వ్యక్తిపై కేసు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామంలోని కొత్తచెరువు కట్టకు అక్రమంగా గండికొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు. ఆరెగూడెం గ్రామానికి చెందిన సామ మహేందర్‌రెడ్డి చెరువు కట్టను జేసీబీతో గండి కొట్టి అందులోని నీటిని బయటికి పోయేలా చేశాడు. దీనిపై గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్ సమాచారం ఇవ్వడంతో ఇరిగేషన్ అధికారులు చెరువుకట్ట వద్దకు వెళ్లి పరిశీలించారు. గండి కొట్టిన వ్యక్తిపై డీఈ రాజవర్ధన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చెరువు కట్ట గండి కొట్టడానికి వినియోగించిన జేసీబీని సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

అదుపుతప్పి పడిపోయిన ధాన్యం లారీ

హుజూర్‌నగర్ : మండలంలోని శ్రీనివాసపురం గ్రామ శివారులో కల్వర్టు వద్ద శుక్రవారం ధాన్యం లారీ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని అమరవరంలో ధాన్యం లోడ్ చేసుకున్న లారీ హుజూర్‌నగర్ వచ్చే క్రమంలో గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు వద్ద అదుపుతప్పి పడిపోయింది. అటుగా వస్తున్న మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. లారీ డ్రైవర్‌ను తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

నల్లగొండ: తన భార్య కనిపించడం లేదని ఓ వ్యక్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నల్లగొండలోని వెంకటరమణ కాలనీకి చెందిన గుంజ రజనీకాంత్ తన భార్య దీపిక శుక్రవారం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిందని, ఆమె సమాచారం తెలియడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. రజనీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. కాగా, వారికి పిల్లలు లేరని తెలిపారు.

జాతీయ స్థాయికి ఎదిగేలా సాధన చేయాలి



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

- ఎస్‌జీఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దశరథరెడ్డి

చౌటుప్పల్ : మల్లకంబ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదిగేలా సాధన చేయాలని ఎస్‌జీఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దశరథరెడ్డి, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. మల్లకంబ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక కోసం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సెలక్షన్స్ నిర్వహించారు. అండర్–14, అండర్–17, అండర్–19విభాగాల కోసం నిర్వహించిన పోటీల్లో ఒక్కో విభాగం నుంచి 12మంది బాలురు, 12మంది బాలికలను ఎంపిక చేశారు. వీరు నవంబర్‌లో చౌటుప్పల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో దశరథరెడ్డి, కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు తమ జిల్లాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంపిక పోటీలు నిర్వహించిన ట్రినిటీ విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ.కృష్ణారావు, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ గురువారావు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వ్యాయామ శిక్షకులు శోభ, బిక్కునాయక్, గోపాల్, కిరణ్, వెంకటేష్, నరేష్, మంజుల పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ఇద్దరు పరస్పర దాడి

భువనగిరిటౌన్ : చెక్ బౌన్స్ కేసులో భువనగిరి జిల్లా కోర్టుకు రికాల్‌కు వచ్చిన ఇద్దరు కక్షిదారులు శుక్రవారం కోర్టు ఆవరణలోనే పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానిక న్యాయవాదులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలం మాదాపూర్‌కు చెందిన ఇసుక నర్సింగ్‌రావు ఐదు సంవత్సరాల క్రితం జనగామకు చెందిన కొత్తపల్లి సతీష్‌కుమార్‌కు రూ.75 లక్షలకు పైగా ఇచ్చాడు. మిగతా డబ్బుల కోసం అతడిపై ఒత్తిడి తేవడంతో నర్సింగ్‌రావు రూ.20లక్షల చెక్కు రాసి ఇచ్చాడు. కానీ ఆ చెక్కు చెల్లుబాటు కాకపోవడంతో అతనిపై భువనగిరి కోర్టులో చెక్కు బౌన్స్ కేసు వేశాడు. నర్సింగ్‌రావు కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో కోర్టు అతడికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో వారెంట్ రీకాల్ కోసం సతీష్‌కుమార్ కోర్టుకు రాగా అదే సమయంలో వచ్చిన ఇసుక నర్సింగ్‌రావు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురు పరస్పరం దాడులు చేసుకున్నారు. అక్కడ ఉన్న వారు ఇద్దరిని విడదీయడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయంపై నర్సింగ్‌రావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

చౌటుప్పల్ రూరల్: కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం చౌటుప్పల్ మండలం గుండ్లబావి స్టేజీ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్రేవు గ్రామానికి చెందిన రావుల బీరప్ప పని నిమిత్తం చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి బైక్‌పై వెళ్లి వస్తున్నాడు. గుండ్లబావి గ్రామ స్టేజీ వద్దకు రాగానే బైక్‌ను కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న బీరప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి బావమరిది కడగంచి శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

వరిలో చీడపీడలు.. నివారణ



చంద్రశేఖర్, సేద్యపు విభాగం శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

త్రిపురారం : వరి పంటలో వాతావరణ మార్పులకు అనుగుణంగా వచ్చే చీడపీడలను రైతులు సరైన సమయంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే పంట దిగుబడులు తగ్గి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. వరి పంటలో సోకే చీడపీడల నివారణకు రైతులకు ఆయన అందిస్తున్న సూచనలు.

అగ్గి తెగులు :
వరి పంటలో వచ్చే అగ్గి తెగులును సరైన సమయంలో గుర్తించి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 1.6 గ్రాములు లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. నత్రజని ఎరువులను తగ్గించుకొని, పొలం గట్లపై ఉన్న కలుపును తీసివేయాలి.

మొగి పురుగు లేదా కాండతొలుచు పురుగు :
వరి పంటలో వాతావరణ పరిస్థితులను బట్టి కాండం తొలుచు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2గ్రాములు, లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిపోల్ 18.5ఎస్‌పీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు :
వరి పంటలో కాండం కుళ్లు తెగులు నివారణకు 2 మి.లీ. హెక్సాకోనాజోల్ లేదా 1 గ్రాము కార్బండిజమ్ లేదా 1 మి.లీ. టేబుకోనాజోల్ 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పలకల కింద వరకు తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.



ఆకు ముడత తెగులు :
వరిలో ఆకు ముడత తెగులు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఉల్లికోడు తెగులు :
ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటకు ఉల్లికోడు తెగులు ఎక్కువగా ఆశిస్తున్నందున దీని నివారణకు నాటిన 10 నుంచి 15 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ గులికలు ఎకరాకు 10 కిలోలు లేదా ఫోరేట్ గులికలు 5 కిలోలు ఎకరాకు లేదా ఫిప్రోనిల్ 2.5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వరుస వర్షాలతో 'బంతి'కి కష్టాలు

- ఎదగని మొక్కలు
- వాడిపోతున్న పూలు
- ఆందోళనకు గురవుతున్న రైతులు



దిగుబడి లేని బంతి పూల తోట

తుర్కపల్లి: వరుస వర్షాల కారణంగా బంతి సాగు చేసిన రైతులు తీవ్రనష్టాన్ని ఎదుర్కొంటున్నారు. మొగ్గ దశలోనే వర్షాలు కురవడంతో మొక్కలు ఎదగకపోవడం, పూసిన పూలు వాడిపోవడం రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. రైతులు చెబుతున్న ప్రకారం అర ఎకరానికి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఎరువులు, మందులు, కలుపు తీయడం, విత్తనాలు, నారు ఖర్చులు అన్నీ కలిపి రైతుల భారం మరింత పెరిగింది. అయితే ఆశించిన దిగుబడి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పండుగల కోసం సాగు..
ప్రతి ఏడాది బతుకమ్మ, నవరాత్రి, దీపావళి పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని బంతి సాగు ప్రారంభించే రైతులు, ఈ సారి వరుస వర్షాల కారణంగా నష్టపోతున్నారు. తుర్కపల్లి మండలంలోని నాగాయిపల్లి, పల్లెపహాడ్, గోపాల్‌పురం, ధర్మారం, రామోజీనాయక్ తండా, మర్రికుంట తండా, మోతీరాంతండా, దయ్యం బండా ప్రాంతాల్లోనే 100 ఎకరాలకు పైగా బంతి సాగు చేశారు. కానీ అధిక వర్షాలతో మొక్కల పెరుగుదల ఆగిపోవడం, పూత రాకపోవడం, ఇప్పటికే పూసిన పూలు వాడిపోవడం వల్ల దిగుబడి ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. అధిక వర్షాలు, తేమ కారణంగా చీడపీడలు, పీల్చే పురుగులు, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులు వంటివి, ఎక్కువగా పెరుగుతాయి. ఇది పంటకు మరింత నష్టం కలిగిస్తుందని పేర్కొంటున్నారు. గతేడాది మంచి లాభాలు తెచ్చిన బంతి సాగు ఈసారి రైతులను అప్పుల బారిన పడేలా చేస్తోందని వాపోతున్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలను వినియోగించి రైతులకు తోడ్పాటు అందించాలని, తడి పంటల కోసం విత్తనాలు, ఎరువులు, క్రాప్ పైపులను ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

బంతి తోట మునిగిపోయింది



వర్షాల కారణంగా మా బంతి తోట మొత్తం నీట మునిగింది. ఉత్పత్తి తగ్గి, ధరలు కూడా తగ్గితే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రభుత్వం సాయం అందించకపోతే రైతులు మరింత కష్టాల్లో పడతారు.

– పాచ్య, రైతు, గోగూల్‌గుట్టతండా